క్లుప్తంగా

అండగా ఉంటాం.. అధైర్య పడొద్దు

ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్



సంగారెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

వట్‌పల్లి(అందోల్): కార్యకర్తల కుటుంబాలకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని, అధైర్య పడొద్దని ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గొర్రెకల్, వట్‌పల్లి గ్రామాల్లో బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. గొర్రెకల్ గ్రామానికి చెందిన ఖాదిరాబాద్ పీఏసీఎస్ డైరెక్టర్ ముంగె సంగారెడ్డి, వట్‌పల్లి ఉపసర్పంచ్ సాయిలు తల్లి ఎర్రొల్ల కేశమ్మ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో వరము చైర్మన్ వీరారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వినోద్‌గౌడ్, డైరెక్టర్ బుద్ధిరెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు అశోక్‌గౌడ్, బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి శివాజీరావు, నాయకులు బస్వరాజ్, సుభాష్‌గౌడ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మైసమ్మ తల్లికి బోనాలు



బోనాలతో ఆలయానికి వెళ్తున్న భక్తులు

రాయికోడ్(అందోల్): మండల పరిధిలోని రాయిపల్లి గ్రామంలో మైసమ్మ తల్లికి గ్రామస్తులు ఆదివారం బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా కళాకారుల విన్యాసాల మధ్య గ్రామంలోని పురవీధుల గుండా బోనాల ఊరేగింపు నిర్వహించి మైసమ్మ అమ్మవారికి బోనాలను సమర్పించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నర్సమ్మ, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తుర్కపల్లికి చేరిన దిండి మహా పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

నారాయణఖేడ్: మనూరు మండల పరిధిలోని ఎల్గొయి నుంచి ఎల్గొయి, అతిమ్యాల్ గ్రామాలకు చెందిన భక్తులు నారాయణఖేడ్ మండలం తుర్కపల్లిలోని భూలక్ష్మమ్మ ఆలయం వరకు మహిళలు నిండు బిందెలను తలలపై పెట్టుకుని భజన కీర్తనలతో దిండి మహా పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో నిర్వహించిన హరిభజనలో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ లక్ష్మిబాయి రవీందర్‌నాయక్, సర్పంచ్ స్రవంతి పరమేశ్వర్, ఉపసర్పంచ్ సాయిరెడ్డి, పరమేశ్వర్ పాల్గొన్నారు.

హెప్టాథ్లాన్ ఈవెంట్‌కు గురుకుల విద్యార్థిని ఎంపిక



అగసర నందిని

మునిపల్లి(అందోల్): హెప్టాథ్లాన్ ఈవెంట్‌కు బుదేరా సాంఘీక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్న అగసని నందిని ఎంపిక యినట్టు ప్రిన్సిపాల్ అరిఫా తెహసీన్ అరా ఆదివారం తెలిపారు. ఈ సంవత్సరం మార్చి 13, 16వ తేదీల్లో నిర్వహించిన ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీస్ అథ్లెటిక్స్ చాంఫియన్ షిప్‌లో నందిని పొందిన పాయింట్లను అధారంగా చేసుకున్నారని తెలిపారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తరపున ప్రాతినిధ్యం వహిస్తూ జూలై 28 నుంచి ఆగస్టు 8వ తేదీ వరకు 2023 చైనాలోని చెంగూ వేదికగా నిర్వహించనున్న వరల్డ్ యూనివర్సిటీస్ అథ్లెటిక్స్ చాంఫియన్ షిప్ (హెఫ్తాటీన్ ఈవెంట్)కు నందిని భారత్ తరపున ఎంపికైనట్లు తెలిపారు. మొదటి అథ్లెట్‌గా ఘనత సాధించడం గర్వకారణమని ఫిజికల్ డైరెక్టర్ రమాదేవి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల బృందం, నందినికి అభినందనలు తెలిపింది.

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



పటాన్‌చెరు: దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: ముస్లిం మైనార్టీల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తెలిపారు. పట్టణ పరిధిలోని సయ్యద్ హజ్రత్ మురాద్ అలీషా దర్గాలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలు, చదర్ సమర్పణ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇటీవల సీఎం కేసీఆర్ పటాన్‌చెరు డివిజన్ అభివృద్ధికి రూ.10 కోట్ల నిధులు మంజూరు చేయడంతో స్థానిక మైనార్టీ నాయకులు, మతపెద్దలు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అఫ్జల్, సీనియర్ నాయకులు లియాకత్‌అలీ, అజ్మత్, ఖాజా, వాజీద్ అలీ, అతీక్, మోయిన్, పాల్గొన్నారు.

ప్రతిపక్ష పార్టీల గల్లంతు ఖాయం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతో రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీల డిపాజిట్లు గల్లంతు కావడం ఖాయమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులనాగులపల్లికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ ఉపసర్పంచ్ ప్రభు ముదిరాజ్, వెంకటేశ్ గౌడ్, బీజేపీ కు చెందిన శంషాబాద్ రవి, రాజు తదితరులు బీఆర్‌ఎస్ చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 9ఏళ్ల బీఆర్‌ఎస్ పాలనలో గ్రామాలు పట్టణాలుగా మారాయని వివరించారు. అన్నివర్గాల ప్రజలకు సమాన న్యాయం చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని తెలిపారు. అభివృద్ధిలో భాగ్యస్వామ్యం కావాల్సిన ప్రతిపక్షాలు కేవలం దుష్ప్రచారానికే పరిమితమవుతున్నాయని విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, నాయకులు రమేష్, లక్ష్మణ్, విఠల్, పాండు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం.. సీఎంఆర్‌ఎఫ్

ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



నారాయణఖేడ్: కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరమని, అన్నివర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తెలిపారు. నారాయణఖేడ్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం కంగ్టి మండలం ఎన్కెమురికి చెందిన యాదమణి, ఖేడ్ మండలం గంగాపూర్‌కు చెందిన భాగ్యవతికి కల్యాణలక్ష్మి ద్వారా మంజూరైన చెక్కులను, తడ్కల్‌కు చెందిన అంజయ్యకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. అదేవిధంగా మార్డికి చెందిన గౌడ సంఘం నాయకులు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేతో సమావేశమై గ్రామంలో గౌడ సంఘం కమ్యూనిటీ భవనం నిర్మించాలని కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్టు సంఘం నాయకులు తెలిపారు. గంగాపూర్‌కు చెందిన హనుమాన్ మందిరానికి దీప ధూప నైవేద్యాల కింద పూజారిగా నియామకం కాగా హన్మండ్లుస్వామికి నియామక పత్రాన్ని అందజేశారు. కల్హేర్ మండలం కృష్ణాపూర్‌కు చెందిన బీజేపీ నాయకులు కుమ్మరిసాయిలు తదితరులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. గంగాపూర్ నుంచి అబ్బెంద వరకు పానాది తోవలో కల్వర్టు నిర్మాణంకు రూ.5లక్షలు మంజూరు కాగా ఎమ్మెల్యేభూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆత్మచైర్మన్ రాంసింగ్, తుర్కాపల్లి ఎంపీటీసీ అశోక్‌రెడ్డి, గంగాపూర్ పీఏసీఎస్ చైర్మన్ నర్సింహారెడ్డి, కృష్ణాపూర్ సర్పంచ్ కిష్టారెడ్డి పాల్గొన్నారు.

వెల్లువెత్తిన ముదిరాజ్‌ల నిరసనలు



హత్నూర: రాస్తారోకో చేస్తున్న ముదిరాజ్ సంఘాల నాయకులు



రామచంద్రాపురంలో..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ముదిరాజ్‌లపై ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఆదివారం తెల్లాపూర్ చౌరస్తా వద్ద ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి చిత్రపటాన్ని చెప్పులతో కొట్టి నిరసన తెలిపారు. అనంతరం సంఘం నాయకులు మాట్లాడుతూ ముదిరాజులపై కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

వట్‌పల్లి(అందోల్): అందోల్–జోగిపేట మున్సిపల్ పరిధిలో ఆదివారం ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు తోట్ల రామకృష్ణ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి శవయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ముదిరాజులపై అనుచిత వాఖ్యలు చేయడమే కాకుండా జీఎస్ఆర్ టీవీ వీడియో జర్నలిస్ట్ బండి అజయ్ ముదిరాజ్‌ను కిడ్నాప్ చేసి వారి అనుచరులతో కలిసి దాడికి పాల్పడిన పాడి కౌశిక్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

హత్నూర(సంగారెడ్డి): ముదిరాజ్‌లను కించపరిచే విధంగా మాట్లాడిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను మండలం దౌల్తాబాద్ తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద ముదిరాజ్ సంఘం నాయకులు ఆదివారం దహనం చేసి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముదిరాజ్ కులస్తులను కించపరిచేవిధంగా మాట్లాడిన కౌశిక్‌రెడ్డికి గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

జహీరాబాద్ టౌన్: ముదిరాజ్‌లను అవమానపరిచే విధంగా మాట్లాడి జర్నలిస్టు అజయ్‌ను అకారణంగా కొట్టిన ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఆ సంఘం నాయకులు ఆదివారం జహీరాబాద్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అంతకు ముందు పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ముదిరాజ్ సంఘం నాయకులు శంకర్, దత్తాత్రి, శివసాయి, రమేష్, మహేష్, అశోక్, ప్రభాకర్, జగన్, అంజి, రవి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఎస్వీ కళాశాలలో రిక్రూట్‌మెంట్ డ్రైవ్

కొండాపూర్(సంగారెడ్డి): సంగారెడ్డి పట్టణంలోని ఎస్వీ జూనియర్ కళాశాలలో ఆదివారం ఎంఎస్ఎన్ ల్యాబొరేటరీ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ వారు రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ రిక్రూట్‌మెంట్‌లో ఇంటర్మీడియట్‌లోని ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో 65 శాతం మార్కులు సాధించిన వారికి అవకాశం కల్పించారు. ఈ రిక్రూట్‌మెంట్‌లో 52 మంది విద్యార్థులు పాల్గొనగా 18మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు ఆ సంస్థ హెచ్‌ఆర్ సుబ్రహ్మణ్యం, విజయ్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డితో పాటు కళాశాల యాజామాన్యం అభినందించింది.

మురుగు.. పరుగు



పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని రహదారిపై నిలిచిన మురుగునీరు

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని రహదారిపై మురుగునీరు నిండిపోవడంతో వాహనదారులకు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. శనివారం సాయంత్రం కురిసిన కొద్దిపాటి వర్షానికి సంగారెడ్డి పట్టణంలోని ప్రధాన రహదారులపై మురుగునీరు నిలవడంతో చిత్తడిగా మారింది. నిత్యం వాహనాలతో పాటు ప్రయాణికులతో రద్దీగా ఉండే ప్రదేశంలో దుర్వాసన వెదజల్లుతుండటంతో స్థానిక ప్రజలు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రహదారిపై నిలిచిన మురుగునీటిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

బ్రిడ్జి పనులను పూర్తి చేయాలి

మునిపల్లి(అందోల్): బోడపల్లి, పిల్లోడి గ్రామాల మధ్య డబ్బువాగుపై అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి పెండింగ్ పనులను పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని పిల్లోడి గ్రామానికి చెందిన పాషామీయా, పెంటాగౌడ్, నర్సింహ్మాగౌడ్ సంబంధిత అధికారులను ఆదివారం కోరారు. బ్రిడ్జి పనులు నిలిచిపోవడంతో డబ్బువాగులో నీళ్లు ఉండడంతో ఇతర గ్రామాలకు వెళ్లడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి బ్రిడ్జి పనులను పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని కోరారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

సదాశివపేట (సంగారెడ్డి): భక్తిశ్రద్ధలతో గడి మైసమ్మ మందిరం 29వ బ్రహ్మోత్సవాలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సంగీత విభావరి, భజన కార్యక్రమాలను నిర్వహించారు.

'రాబోయే ఎన్నికల్లో బీజేపీదే అధికారం'



న్యాల్‌కల్: ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



నారాయణఖేడ్‌లో..



జిన్నారంలో..

నారాయణఖేడ్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జన్‌వాడే సంగప్ప ధీమా వ్యక్తం చేశారు. మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా మండల పరిధిలోని అనంతసాగర్, చందాపూర్ గ్రామాల్లో ఆదివారం ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. 9ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం అనంతసాగర్‌కు చెందిన ఆకుల హన్మయ్య ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు సాయిరాం, సంజీవ్‌పటేల్, రాజుగౌడ్, సంగారెడ్డి, సచిన్ పాల్గొన్నారు.

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని మాదారం గ్రామంలో బీజేపీ అధ్యక్షుడు మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం గడపగడపకు బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోదావరి అంజిరెడ్డి, పటాన్‌చెరు నియోజకవర్గం కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బండి శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సోలక్‌పల్లి గ్రామంలో..

మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం జిన్నారం మండలంలోని సోలక్‌పల్లి గ్రామంలో బీజేపీ నాయకులు ప్రతాప్ రెడ్డి, జగన్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ పీఎం మోడీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధిస్తోందన్నారు. నాయకులు నర్సింగ్‌రావు, రాజిరెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

న్యాల్‌కల్(జహీరాబాద్): మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ఆదివారం మండల పరిధిలోని మిర్జాపూర్(బి), ఖలీల్‌పూర్ గ్రామంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్ర రాజ నర్సింహ అధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఏక్‌నాథ్ పాటిల్, ఓంకార్, మల్లేష్ గంగ్వార్, శ్రీనివాస్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, ఓనమ్‌రెడ్డి పాల్గొన్నారు.

కోకాపేటకు తరలిన గౌడ సంఘం నాయకులు



మునిపల్లి: హైదరాబాద్‌కు తరలివెళ్తున్న నాయకులు

మునిపల్లి(అందోల్): హైదరాబాద్‌లోని కోకాపేటలో 5ఎకరాల్లో నిర్మించనున్న గౌడ ఆత్మగౌరవ భవన నిర్మాణానికి సీఎం కేసీఆర్ భూమిపూజ చేయనున్న సందర్భంగా ఆదివారం మండలంలోని మండలంలోని తాటిపల్లి, మునిపల్లి, పిల్లోడి, ఖమ్మంపల్లి తదితర గ్రామాల నుంచి గౌడ సంఘాల నాయకులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా గౌడ సంఘం సీనియర్ నాయకులు పిల్లోడి ప్రభుగౌడ్ మాట్లాడుతూ గౌడ ఆత్మగౌరవ భవన నిర్మాణానికి సీఎం కేసీఆర్ రూ.5 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, వెంకట్‌గౌడ్, పరశురాం గౌడ్, దుర్గాగౌడ్, ధన్‌రాజ్‌గౌడ్, రత్నాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

సంగారెడ్డి టౌన్: హైదరాబాద్‌లోని కోకాపేటలో నిర్మించనున్న గౌడ ఆత్మీయ భవన భూమి పూజకు ఆదివారం సంగారెడ్డి గౌడ సంఘం జిల్లా అధక్షుడు నాగరాజుగౌడ్ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా నుంచి వాహనాల్లో గీత కార్మికులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు.

సదాశివపేట (సంగారెడ్డి): హైదరాబాద్‌లోని కోకాపేటలో నిర్మించనున్న గౌడ ఆత్మీయ భవన భూమిపూజకు ఆదివారం సదాశివపేట మండల పరిధిలోని గౌడ సంఘం నాయకులు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. సదాశివపేట పట్టణంలోని నెంబర్ వన్ సొసైటీ అధ్యక్షుడు సీఎస్ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో సొసైటీ సభ్యులు తరలివెళ్లారు.

చెత్త తొలగించాలని విన్నపం




సాయిరాంనగర్ కాలనీలో పారబోసిన చెత్త

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని సాయిరాంనగర్ కాలనీలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని మున్సిపల్ అధికారులను కాలనీ ప్రజలు కోరుతున్నారు. ప్రతి శనివారం సాయిరాంనగర్ కాలనీలో వారంతపు సంత నిర్వహిస్తుండగా చెత్త పేరుకుంటుందన్నారు. సంతకు కూరగాయలు తీసుకొచ్చిన వ్యాపారులు వెళ్లే ముందు ఇష్టానుసారంగా చెత్తను పారబోస్తున్నారన్నారు. దీంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతుండటంతో ఇబ్బందులకు గురవుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సాయిరాంనగర్‌లో వారంతపు సంత నిర్వహించకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు.

డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్‌లో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులో మున్సిపాలిటీ పరిధిలో నివసించే పేదలకు 50శాతం కేటాయించాలని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం కొల్లూర్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద స్థానిక కౌన్సిలర్ మయూరి రాజుగౌడ్‌తో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం డబుల్ బెడ్ రూమ్ గేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెల్లాపూర్, కొల్లూర్‌లకు సంబంధించిన విలువైన భూములను ప్రభుత్వం తీసుకుందన్నారు. కానీ.. ఇక్కడి నిరుపేదలకు ఇళ్లను కేటాయించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కౌన్సిలర్‌లు పావని, సరిత, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్‌లు రాజుగౌడ్, శ్యాంరావు, తెల్లాపూర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు రవీందర్, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న నాయకులు

సంక్షిప్త వార్తలు

◆ వార్డు అభివృద్ధికి కృషి

సదాశివపేట (సంగారెడ్డి): వార్డు అభివృద్ధే ప్రధాన లక్ష్యమని కౌన్సిలర్ ఇలియాస్ షరీఫ్ అన్నారు. ఆదివారం సదాశివపేట మున్సిపల్ పరిధిలోని 18వ వార్డులో మున్సిపల్ జనరల్‌ఫండ్ నిధులతో తాగునీటి సమస్య పరిష్కారానికి బోరుమోటారు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు ప్రజలు మునిపల్లి రమేష్, గాజుల జనార్దన్, నాగారం పెంటయ్య, మునిపల్లి మధు, తాహెర్, గాజుల వెంకటేష్, షరీఫ్ అజ్మత్, పాల్గొన్నారు.

◆ రాచయ్యస్వామికి సన్మానం

జహీరాబాద్ టౌన్: రంజోల్ రాజమోగి ఆశ్రమ పీఠాధిపతి రాచయ్యస్వామికి భారత్ గౌరవ రత్న అవార్డు వచ్చిన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. వరల్డ్ ఉమ్మెన్స్ రైట్ ప్రొటెక్షన్ కమిషన్ వారు రాచయ్యస్వామికి ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాజీ డీసీసీబీ చైర్మన్ జైపాల్‌రెడ్డి, టీపీసీసీ నాయకులు నరోత్తంలు ఆదివారం రంజోల్ ఆశ్రమానికి వెళ్లి ఆయనను సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాచయ్యస్వామి తన బోధనల ద్వారా మానవత విలువల గురించి తెలుపుతూ భక్తిభావం పెంపొందిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బుచ్చిరెడ్డి, నాయకులు మైనోద్దీన్, భీమశంకర్, నారాయణరెడ్డి, భాస్కర్, వేణుగోపాల్‌రెడ్డి, కార్తీక్ రెడ్డి, జైపాల్ పాల్గొన్నారు.

◆ వసతి గృహంలో చేరాలని ప్రచారం



వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని దేవునూర్‌లోని ఎస్సీ బాలుర వసతి గృహంలో పిల్లలను చేర్పించాలని తల్లిండ్రులను కోరుతూ షాద్‌నగర్, వట్‌పల్లి, దేవునూర్ గ్రామాల్లో ఆదివారం ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో కల్పించే వసతులపై ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం వార్డెన్ నర్సింలు మాట్లాడుతూ మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు చేరేందుకు సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. అడ్మిషన్ పొందాలనుకునే విద్యార్థులు ఆధార్‌కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ జిరాక్స్ పత్రాలతో పాటు బోనోఫైడ్ మూడు పాస్ ఫొటోలు తీసుకొని రావాలన్నారు. మర్ని వివరాలకు 9948669039 ఫోన్ నెంబరును సంప్రదించాలని సూచించారు.

◆ దయల్ యువర్ డీఎం కార్యక్రమానికి స్పందన

జహీరాబాద్ టౌన్: ఆర్టీసీ డిపోలో ఆదివారం నిర్వహించిన దయల్ యువర్ డీఎం కార్యక్రమానికి మంచి స్పందన వచ్చిందని మేనేజర్ రజని కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగిందని, పలు గ్రామాల నుంచి ప్రజలు బస్సు సౌకర్యం కోసం ఫోన్‌లు చేశారన్నారు. డిపో పరిధిలోని హుసేనగర్, పిపడ్‌పల్లి వికారాబాద్ జిల్లా మర్పల్లికి బస్సులు నడపాలని చాలామంది ఫోన్ చేశారన్నారు. జహీరాబాద్ పట్టణంలోని విద్యా సంస్థలకు వెళ్లే విద్యార్థుల కోసం గ్రామాల నుంచి ఉదయం 9 గంటలు, డిపో నుంచి సాయంత్రం 5 గంటలకు బస్సు సర్వీస్ నడపాలని ఎక్కువ మంది ఫోన్ చేశారని డీఎం తెలిపారు. వీలును బట్టి బస్సు సర్వీసుల సౌకర్యం కల్పిస్తామన్నారు.